# మేలు మేలు

వెంకటేశ్వర్లు చేతిలో దీపం. నిండా మట్టితోపాటు మకిలి. నగిషీలు చెక్కి ఉన్నది. ఇత్తడిది. అతి పురాతనమైనది.

ఒక్క గదితో పంచ దింపుకుందామని వెంకటేశ్వర్లు ప్రయత్నం. సొంత ఇంటికోసం ఎన్నాళ్ళుగానో పడ్డ తపన. దాన్ని ఆచరణలో పెట్టడానికిప్పుడు అవకాశం. ఫలితం ఈ పునాదులు. పునాదుల్లో దొరికింది ఇత్తడి దీపం.

అనూహ్యంగా దొరికింది. అందర్నీ భ్రమపెట్టే పదవిలా తన చేతిలో ఉంది. అది దఖలుపరిచే అధికారంలాకూడా ఉంది. ఏదైనా దేశంలోనో..... చటుక్కున స్ఫురించింది వెంకటేశ్వర్లుకి.

అలాదీన్ లాంప్! ఇలానే ఉండిఉంటుంది. కథ జ్ఞాపకం వచ్చింది.

ఎన్నిపాట్లు పడ్డాడు అలాదీన్. మాంత్రికుడు చచ్చేక దీపం అతని చేతిలోకి వచ్చింది. రాజ్యం చేతిలోకి తెచ్చింది. దాంతోపాటు రాజ్యంలోని ప్రజలు. ప్రజానురంజకంగా పాలించేడని కథ పూర్తవుతుంది.

కాని కథ అక్కడే మొదలు. దీపం చేతిలో ఉంది కాబట్టి ఎవరికేది కావాలన్నా క్షణంలో హాజరు. ఆ రకంగా పేదరికం ఉండదు. ఆకలి ఉండదు. బాధలుండవు. రోగాలుండవు. లోటుండదు. కష్టపడడం ఉండదు. ఉండేదల్లా సుఖమే. మరా సుఖంకోసం అలాదీన్ చుట్టూ ప్రజలంతా తిరగడమే. అతనికి ఇష్టులైనవారికే భోగాలు. తస్మదీయులకి...? అంతా వన్‌మేన్‌షో.

ఆ సుఖం గురించి తలచుకుంటే ఒక్క క్షణం వెంకటేశ్వర్లుకి ఒళ్ళు పులకరించింది.

ఒక్క గది కట్టించడానికి ఎంత కష్టపడుతున్నాడు! జీతంలో మిగిల్చి మిగిల్చి జాగా కొన్నాడు. గది కోసం ప్లాన్. మున్సిపాలిటీ చుట్టూ మంజూరు కోసం తిప్పలు. పునాదులు తవ్వించడానికి డబ్బుకోసం వ్యాపకం. కూలీల్చేత

పని చేయించడానికి పాట్లు.

ఇది అలాదీన్ దీపమే అయితే దీన్ని రుద్దితే....

ఈ జాగాలోనే సునాయాసంగా మహాభవంతి. కాని మున్సిపాలిటీవాడు అడ్డుపడ్తాడు. వాణ్ణి తప్పించుకుంటే ఆదాయంపన్ను అధికారులదాడి. ఎక్కడి నుంచి వచ్చిందింత డబ్బు? ఎలా సంపాదించేవు? చెప్పలేక చావాలి. దీపం ఉందికదాని ఉద్యోగం మానేస్తాడు. పిల్లలు చదువులు మానేస్తారు. ఉబ్బరగా వస్తున్నదని కడుపు ఉబ్బేట్టు తింటారు. దాంతో రోగాలు. ఉందికదా దీపం. మంచికీ చెడ్డకీ దీపమే అన్నింటికీ దీపం మీదే ఆధారపడ్డం. ఆశ్రితులెక్కువౌతారు. శత్రువులు వారికి రెండింతలౌతారు. తనే కాదు తన చుట్టూవున్న వాళ్ళంతా బ్రతికుండి నిర్జీవులవుతారు.

భయం వేసింది.

పారెయ్యడం ఉత్తమం. కానేంలాభం? మరోడికి దొరుకుతుంది. కథ మామూలే.

ఇలా కాదు.

వెంకటేశ్వర్లు ఇంతమట్టి తీసుకుని దీపాన్ని రుద్దేడు.

ఆకాశమెత్తు భూతం.

"దొరా ... ఏం సెలవు?" భీకరంగా గర్జన.

"ఈ దీపంతోపాటు నువ్వూ మాయమైపో"

వెంకటేశ్వర్లుకి మనసు తేలికైపోయింది. పునాదిరాయి కొనడానికి మరోలోన్ కోసం దరఖాస్తు చేసేడు.

*(ఆంధ్రభూమి డైలీ, 22-4-1987)*